# ప్రజాశక్తి

సోమవారం 13 అక్టోబర్ 2025

## శ్రీ సత్యసాయి

మహాసభలో మాట్లాడుతున్న ఆశావర్కర్ల యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ధనలక్ష్మి

# 'ఆశా'ల సమస్యలు పరిష్కరించాలి

### ఆశా వర్కర్ల యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె. ధనలక్ష్మి
### కదిరిలో ఆశావర్కర్ల యూనియన్ జిల్లా మహాసభ

**ప్రజాశక్తి - కదిరి టౌన్**

ఆశావర్కర్ల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని ఆశాలో 24 గంటలు పని చేయించుకోవటం కాదు కనీస వేతనం 24 వేల రూపాయలు ఇవ్వాలని ఆశావర్కర్ల యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె. ధనలక్ష్మి డిమాండ్ చేశారు. ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా రెండవ మహాసభలు కదిరిలో ఆదివారం నిర్వహించారు. పట్టణంలోని కోనేరు వద్ద ఉన్న ఎస్.కె ఫంక్షన్ హాల్ ఆశావర్కర్ల జిల్లా అధ్యక్షురాలు త్రివేణి అధ్యక్షతన జరిగిన మహాసభకు ముఖ్య అతిథులుగా ఆశా వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కే ధనలక్ష్మి , సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు జి .ఓబులు, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఈఎస్ వెంకటేష్ హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆశా వర్కర్లు చాలీ చాలని వేతనాలతో జీవనం సాగిస్తున్నారని కనీస వేతనాలు చెల్లించాలని, పనిభారాన్ని తగ్గించి, ప్రభుత్వ సెలవులు, సంక్షేమ పథకాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఆశా వర్కర్లకు సంక్షేమ పథకాలు అమలు చేయాలని అనేక సందర్భాలలో వినతి పత్రాలు ఇచ్చినా ప్రభుత్వం స్పందించలేదన్నారు. గత 18సంవత్సరాలుగా పేద ప్రజలకు ఆరోగ్య సేవలు అందిస్తున్న 'ఆశా'ల సేవలను ప్రభుత్వం గుర్తించాలన్నారు. వారి న్యాయమైన సమస్యలు పరిష్కారం చేయడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మీన మేషాలు లెక్కిస్తున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆశా వర్కర్లకు సంబంధం లేని పనులు రోజూ విలేజ్ క్లినిక్, సచివాలయాల్లో ఉదయం 9 గంల నుండి సాయంత్రం 5 గంటల వరకు ఉండాలనడం, క్లినిక్‌లను శుభ్రం చేయించడం, ఓ.పి వర్క్, అటెండర్ పనులు చేయించడంతో పాటు ఉదయం, సాయంత్రం రెండు సార్లు రిజిస్టర్లో సంతకాలు చేయించాలని అధికారులు ఇబ్బందులకు గురి చేయడం బాధాకరమన్నారు. రికార్డులకు సొంత డబ్బులు పెట్టి కొనాలని, సంబంధం లేని ఆన్లైన్ వర్కులన్నీ సొంత ఫోన్ ద్వారా చేయాలని వేధించడం, బెదిరింపులకు గురి చేయడం సరైంది కాదన్నారు. రాష్ట్ర మహాసభల్లో ఆశా వర్కర్ల సమస్యపై చర్చించి రాబోవు రెండు సంవత్సరాల్లో పెద్ద ఎత్తున ప్రభుత్వాలపై ఒత్తిడి తీసుకొచ్చి కనీస వేతనాలు అమలు చేయించేంతవరకు పోరాడుతామని హెచ్చరించారు. అనంతరం నూతన కమిటీని 30 మందితో ఏకగ్రీవంగా ఎన్నుకొన్నారు. అధ్యక్షురాలుగా రాధమ్మ, ప్రధాన కార్యదర్శిగా సౌభాగ్య, కోశాధికారిగా రమాదేవి, ఉపాధ్యక్షులుగా త్రివేణి, మంజుల అంజినమ్మ, నారాయణమ్మ, మహాలక్ష్మిని ఎన్నుకొన్నారు. అదే విధంగా సహాయ కార్యదర్శులుగా మమత, ముంతాజ్, చెన్నకృష్ణమ్మ, చంద్రకళను ఏకగ్రీవంగా ఎన్నుకోన్నారు.ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి రామకృష్ణ, ఆశావర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి సౌభాగ్య, సిఐటియు జిల్లా కోశాధికారి సాంబశివ, ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా నాయకులు ప్రతినిధులు పాల్గొన్నారు.

మహాసభలకు హాజరైన ఆశావర్కర్లు

ఆశావర్కర్స యూనియన్ జిల్లా అధ్యక్షురాలు రాధమ్మ

ఆశావర్కర్స యూనియన్ జిల్లా అధ్యక్షురాలు సౌభాగ్యమ్మ

- నేటి నుంచి మూడు రోజుల పాటు ఐద్వా 16వ రాష్ట్ర మహాసభ
- తరలిరానున్న జాతీయ, రాష్ట్ర నేతలు
- లలిత కళా పరిషత్ హాలులో బహిరంగ సభ
- ఎంకెఎం హాలులో ప్రతినిధుల సభ
- ఐద్వా జెండాలు, తోరణాలతో నగరం ముస్తాబు

# ఐద్వా మహాసభలకు 'అనంత' ముస్తాబు

అనంతపురం నగరంలో జరుగనున్న అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) రాష్ట్ర మహాసభకు సర్వం సిద్ధమైంది. సోమవారం నుంచి మూడు రోజులపాటు ఐద్వా 16వ రాష్ట్ర మహాసభ జరుగనుంది. ఈ మహాసభకు జాతీయ, రాష్ట్ర స్థాయి ఐద్వా నాయకులందరూ విచ్చేస్తున్నారు. ఇప్పటికే ఐద్వా జాతీయ కోశాధికారి ఎస్.పుణ్యవతి, రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు ప్రభావతి, రమాదేవి విచ్చేశారు. రాష్ట్రంలోని 26 జిల్లాల నుంచి 400 మంది ప్రతినిధులు ఈ మహాసభకు హాజరుకానున్నారు. వీరందరూ బస చేసేందుకు వీలుగా ఏర్పాట్లు చేశారు. మూడు రోజులపాటు వీరందరూ రాష్ట్రంలో మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలతోపాటు, 15వ మహాసభ నుంచి ఇప్పటి వరకు ఐద్వా ఆధ్వర్యంలో చేపట్టిన కార్యక్రమాలను పున:సమీక్షించుకోనున్నారు. అనంతరం రాబోయే మూడు సంవత్సరాల కార్యచరణను రూపొందించ నున్నారు.

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

**13-10-2025(మొదటి రోజు)**

| | |
|---|---|
| ఉదయం 10.30గం॥ | ఆర్ట్స్ కళాశాల మైదానం నుంచి ప్రదర్శన |
| ఉదయం 11.30గం॥ | లలిత కళా పరిషత్ హాలులో బహిరంగ |
| మధ్యాహ్నం 2.00 గం॥ | రిజిస్ట్రేషన్లు ప్రారంభం |
| మధ్యాహ్నం 3.30 గం॥ | పతాకావిష్కరణ |
| అధ్యక్షవర్గం, మినిట్స్ కమిటీ ఎన్నిక | 4.00గం॥ |
| ఆహ్వాన సంఘం అధ్యక్షురాలి స్వాగతం | 4.25 గం॥ |
| ప్రారంభ ఉపన్యాసం | 4.35 గం॥ నుంచి 5.15 |
| మహిళా సమాఖ్య సౌహార్ద్ర సందేశం | 5.15 గం॥ నుంచి 5.25 గం॥ |
| బ్రేక్ | 5.25 గం॥ నుంచి 6 గం॥ |
| తీర్మానాలు, అర్హతలు, కమిటీల ఎన్నిక | 6 గం॥ నుంచి 6.15 గం॥ |
| కార్యదర్శి నివేదిక | 6.15గం॥ నుంచి 7గం॥ |
| చర్చలు | 7.00 గం॥ నుంచి 8.30 గం॥ |

**రెండవ రోజు (14.10.2025)**

| | |
|---|---|
| ఐద్వా జాతీయ ప్రధాన కార్యదర్శి ఉపన్యాసం | 9.30 - 10.10 గం॥ వరకు |
| విజేతలు -పోరాటాలు- బాధితులు | 10.45 - 11.05గం॥ |
| సౌహర్ద సందేశాలు | 10.45 - 11.05గం॥ |
| బ్రేక్ | |
| చర్చలు ప్రారంభం | 11.40 - 12.30 గం॥ |
| పుస్తకావిష్కరణ | 12.30 - 1.00గం॥ |
| సౌహర్ద సందేశాలు | 1.00 - 1.30 గం॥ |
| బ్రేక్ | 1.30 - 2.30గం॥ |
| చర్చలు ప్రారంభం | 3.00 - 5.30గం॥ |
| సాంస్కృతిక కార్యక్రమాలు | 6.30 - 8.00 గం॥ |

**నేడు ప్రదర్శన, బహిరంగ సభ**

ఐద్వా 16వ రాష్ట్ర మహాసభ సందర్భంగా మొదటి రోజు భారీ ప్రదర్శనతోపాటు బహిరంగ సభ జరుగనుంది. సోమవారం ఉదయం 10.30 గంటలకు ఆర్ట్స్ కళాశాల మైదానం నుంచి ప్రదర్శన ఉంటుంది. టవర్‌క్లాక్ మీదుగా సప్తగిరి సర్కిల్ వరకు ప్రదర్శన ఉంటుంది. అనంతరం లలిత కళా పరిషత్ హాలులో బహిరంగ సభ జరుగనుంది. ఈ సభకు ఐద్వా జాతీయ అధ్యక్ష, కార్యదర్శులు మరియం ధావలే, శ్రీమతి టీచర్, కోశాధికారి ఎస్.పుణ్యవతితోపాటు, సామాజికవేత్త తీస్తా సేతల్వాడ్‌లు ముఖ్య అతిథులుగా హాజరై ప్రసంగించానున్నారు. వీరితోపాటు రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు ప్రభావతి, రమాదేవి, కోశాధికారి సావిత్రలు పాల్గొంటారు.

**మూడు రోజులపాటు ఎంకెఎం హాలులో ప్రతినిధుల సభ**

బహిరంగ సభ అనంతరం మధ్యాహ్నం నుంచి జాతీయ రహదారి 44 ఆనుకుని ఉన్న ఎంకెఎం ఫంక్షన్ హాలులో ప్రతినిధుల సభ ఆరంభమవుతుంది. ఐద్వా పతాకావిష్కరణతో ఈ సభ ప్రారంభమై మూడు రోజులపాటు ఈ సభలో రాష్ట్రంలోని మహిళల పరిస్థితులు, ప్రభుత్వ విధానాలు తదితర అంశాలపై చర్చించనున్నారు. రెండవ రోజు కవులు రచనలతో కూడిన పుస్తకావిష్కరణలు ఉండనున్నాయి. పూర్తిస్థాయి చర్చల అనంతరం కర్తవ్యాలను నిర్ణయించుకోవడంతోపాటు నూతన కమిటీ ఎన్నిక ఉంటుంది. ఈనెల 15వ తేదిన ఈ మహాసభ ముగియనుంది.

**మూడవ రోజు(15.10.2025)**

| | |
|---|---|
| కర్తవ్యాలపై ఎస్.పుణ్యవతి ప్రసంగం | 9.30-10.00గం॥ |
| తెలంగాణ పోరాటంలో మహిళల వీరోచిత పాత్ర | ప్రథమ |
| మహాసభ నివేదిక పుస్తకావిష్కరణ | |
| సబ్ కమిటీల పరిచయం | 10 -10.15గం॥ |
| సబ్ కమిటీల చర్చలు | 10.15-11.30 గం॥ |
| బ్రేక్ | |
| సబ్ కమిటీల రిపోర్టింగ్ | 12-12.30 గం॥ |
| కార్యదర్శి సమాధానం | 12.30 - 12.45 గం॥ |
| నివేదిక ఆమోదం | 12.45-12.50 గం॥ |
| ముగింపు ఉపన్యాసం శ్రీమతి | 12.50- 1.30గం॥ |
| బ్రేక్ | |
| రాష్ట్ర కమిటీ ఎన్నిక | 2.30 - 3.00గం॥ |
| భవిష్యత్ కర్తవ్యాలు- నూతన కార్యదర్శి | 3.00-3.15 గం॥ |
| రిలీవర్సుకు అభినందనలు | 3.15-3.30గం॥ |
| ఆహ్వాన సంఘం అభినందనలు | 3.30-3.50 గం॥ |
| ముగింపు గీతం | 3.50- 4.00 గం॥ |

# ఎంపీడీవో అవినీతిపై ఎమ్మెల్యేకు ఫిర్యాదు

**ప్రజాశక్తి - చిలమత్తూరు**

చిలమత్తూరు మండలంలోని ఎంపీడీవో కార్యాలయంలో మండల పరిషత్తు నిధులు దుర్వినియోగం అవుతున్నాయని స్థానిక విలేకర్లు ఎమ్మెల్యే బాలకృష్ణకి వినతి పత్రం సమర్పించారు. ఎంపీడీవో రమణమూర్తి తన వ్యక్తిగత ప్రయోజనాల కోసం నిధులను వాడి బిల్లులు పెట్టి ప్రజా ధనాన్ని దుర్వినియోగం చేసుకున్నారనే ఆరోపణలున్నాయన్నారు. ఆర్టీఐ ద్వారా అడిగిన సమాచారం అడితే ఇవ్వటం లేదన్నారు. ఈవిషయంపై సంప్రదించిన విలేకర్లపై దుర్భాషలు ఆడుతున్నారని, అనుచిత వాఖ్యలు చేశారని విలేకరులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. అందుకు సంబంధించిన ఆడియో సోషల్ మీడియాలో వైరల్ అయిందన్నారు. అలాగే ఇంటి పన్నులు, బిల్లింగ్, కరెంటు కనెక్షన్లలో అక్రమాలు, ఉపాధి హామీ పథకంలో అవినీతి వంటి అంశాలపై విచారణ జరిపి, బాధ్యులపై తగిన చర్యలు తీసుకోవాలని విలేకర్లు ఎమ్మెల్యేను కోరారు.

# పట్టణాభివృద్ధికి కృషి చేయాలి : ఎమ్మెల్యే బాలకృష్ణ

మున్సిపల్ అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బాలకృష్ణ

**ప్రజాశక్తి-హిందూపురం**

హిందూపురం పట్టణం వేగవంతంగా అభివృద్ధి చెందడానికి తన వంతు కృషి చేస్తానని, అందుకు అందరూ అధికారులు సమిష్టిగా పనిచేసి ప్రభుత్వం నుండి వచ్చే నిధులను సక్రమంగా వినియోగించి అభివృద్ధి పనులు వేగవంతంగా చేయాలని శాసనసభ్యులు నందమూరి బాలకృష్ణ పేర్కొన్నారు. ఈ మేరకు ఆయన ఆదివారం తన నివాసంలో మున్సిపల్ చైర్మన్ డిఈ రమేష్ కుమార్, కమిషనర్ మల్లికార్జున ఇతర అధికారులతో కలిసి హిందూపురం మున్సిపాలిటీపై సమీక్ష నిర్వహించారు. శాఖాపరమైన సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అన్ని విభాగాలలో జరుగుతున్న అభివృద్ధి గురించి కమిషనర్ ఎమ్మెల్యేకు వివరించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం నుండి ప్రత్యేకంగా తెప్పించిన రూ.92 కోట్ల రూపాయల పనులను నవంబర్ మొదటి వారంలో ప్రారంభించేందుకు అన్ని చర్యలు తీసుకోవాలని తెలిపారు. అలాగే రూ.18.50 కోట్లతో హిందూపురం మున్సిపాలిటీ నూతన కార్యాలయం, గుడ్డం కోనేరు సంబంధించిన నూతన కోనేరు నిర్మాణం డిపిఆర్‌లు ప్రభుత్వానికి పంపాలన్నారు. పట్టణ పరిశుభ్రత, ప్రజారోగ్యంపై శ్రద్ధ చూపాలని సూచించారు. అదే విధంగా అక్రమ లేఅవుట్ల క్రమబద్ధీకరణ పథకంపై దృష్టి సారించి ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా లేఅవుట్ల క్రమబద్ధీకరణకు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. సూర్య ఘర్ యోజన పథకం ద్వారా ప్రజలకు చైతన్యం కల్పించి సాధ్యమైనంత ఎక్కువ సంఖ్యలో సోలార్ పలకలను ఏర్పాటు చేసుకునే విధంగా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే వ్యక్తిగత కార్యదర్శి వీరయ్య తదితరులు పాల్గొన్నారు.

**సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు అందజేత :** నియోజకవర్గ వ్యాప్తంగా ముఖ్యమంత్రి సహాయనిధికి దరఖాస్తు చేసుకున్న 69 మంది లబ్ధిదారులకు మంజూరైన సిఎం రిలీఫ్ ఫండ్‌కు సంబందించి రూ.45 లక్షల విలువైన చెక్కులను ఎమ్మెల్యే బాలకృష్ణ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు ప్రజల ఆరోగ్య భద్రతే రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన లక్ష్యమన్నారు.

**స్వచ్ఛ హిందూపురమే లక్ష్యం :** స్వచ్ఛ హిందూపురమే లక్ష్యంగా ముందుకు సాగాలని బాలకృష్ణ మెప్మా అధికారులకు, సిబ్బందికి సూచించారు. గతవారం హిందూపురం పురపాలక సంఘానికి స్వచ్ఛత, హోం కంపోస్ట్, టెరాస్ గార్డెన్ కు సంబంధించి జిల్లా స్థాయిలో రెండు అవార్డులు వచ్చాయి. ఈ అవార్డులను జిల్లా కలెక్టర్ చేతులమీదుగా అందుకున్నారు. ఈ విషయం తెలిసిన బాలకృష్ణ మెప్మా డీఎంసీ గంగులయ్య, విజయలక్ష్మిని అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణంలోని 14వ వార్డులో ఉన్న భవాని మహిళా సమైక్య, రెండవ వార్డ్ లోని అన్నపూర్ణేశ్వరి మహిళా సమైక్య ఎంతో చిత్తశుద్ధితో పనిచేయడం వల్ల గుర్తింపు లభించిందన్నారు. వీరిని ఆదర్శంగా తీసుకుని మిగిలిన సమైక్యలు కూడా పట్టణ అభివృద్ధికి కృషి చేయాలని సూచించారు. మహిళలను ప్రోత్సహించి మరింత అభివృద్ధి పథంలో మెప్మాను నడిపించాలని కమిషనర్‌కు సూచించారు. ఈ కార్యక్రమంలో టిఎల్ఎఫ్ అధ్యక్ష కార్యదర్శులతో పాటు మెప్మా సిబ్బంది పాల్గొన్నారు.

# ఎన్ఎస్పిఆర్‌లో 'దీన్ దయాళ్ స్పర్శ్ యోజన' పరీక్ష

**ప్రజాశక్తి-హిందూపురం**

తపాలా శాఖ ఆధ్వర్యంలో విద్యార్థుల్లో ఫిలాటలీ (పోస్టల్ స్టాంపుల సేకరణ మరియు అధ్యయనం) పట్ల ఆసక్తిని పెంచేందుకు 'దీన్ దయాళ్ స్పర్శ్ యోజన' స్కాలర్‌షిప్ పథకం పరీక్ష నిర్వహించినట్లు తపాలా శాఖ పర్యవేక్షకులు విజయ్ కుమార్ తెలిపారు. ఆదివారం స్థానిక ఎన్ఎస్పిఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో ఈ పరీక్ష జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 6వ తరగతి నుండి 9వ తరగతి వరకు చదువుతున్న విద్యార్థులు పెద్ద సంఖ్యలో పరీక్ష హాజరైనట్లు చెప్పారు. దీన్ దయాళ్ స్పర్శ్ యోజన పరీక్షలో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు నెలకు రూ. 500 చొప్పున ఏడాదికి రూ. 6వేలు స్కాలర్‌షిప్‌గా అందిస్తామని తెలిపారు. స్టాంపుల సేకరణపై అవగాహన, చరిత్ర, సంస్కృతి, సైన్స్, క్రీడలు, కరెంట్ అఫైర్స్ వంటి అంశాలపై విద్యార్థుల జ్ఞానాన్ని పరీక్షించడమే ఈ పోటీ పరీక్ష లక్ష్యమన్నారు. విద్యార్థులు చదువుతో పాటు ఇలాంటి అభిరుచులను పెంచుకోవడం వల్ల వారి సాధారణ జ్ఞానం, సృజనాత్మకత మెరుగుపడతాయని తెలిపారు. స్కాలర్‌షిప్‌కు ఎంపిక ప్రక్రియలో క్విజ్ పరీక్షలో ఉత్తీర్ణులైన వారికి ప్రాజెక్ట్ వర్క్ కూడా ఉంటుందని వివరించారు. ఈ పరీక్షకు హాజరైన విద్యార్థులందరిని అభినందించారు. పరీక్ష నిర్వహణకు సహకరించిన కళాశాల యాజమాన్యానికి కృతజ్ఞతలు తెఇపారు. ఈ కార్యక్రమంలో డివిజన్ తపాలా శాఖ ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

# 'పాంచజన్య' సేవాభావం అభినందనీయం

### మున్సిపల్ ఛైర్మన్ రమేష్‌కుమార్

**ప్రజాశక్తి-హిందూపురం**

పట్టణంలో ఎంతోమంది ధనికులు ఉన్నప్పటికీ వారెవరికి లేని సేవాగుణం పాంచజన్య శ్రీనివాసులుకు ఉందని, సేవా భావంతో ముందుకెళుతున్న ఆయనను ఆదర్శంగా తీసుకోవాలని మున్సిపల్ ఛైర్మన్ రమేష్ కుమార్ పేర్కొన్నారు. ఆదివారం పట్టణంలోని పాంచజన్య పాఠశాలలో పాంచజన్య భారతి శ్రీనివాస్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో హిందూపురం పట్టణంతోపాటు రూరల్ మండలం, లేపాక్షి, చిలమత్తూరు మండలాల పరిధిలోని వివిధ గ్రామాలకు చెందిన వెయ్యిమంది వృద్ధులకు చీరలు, ధోతీలు, దుప్పట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా శ్రీనివాసులు అధ్యక్షత ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మున్సిపల్ వైర్ పర్సన్ రమేష్ కుమార్, మండల విద్యాశాఖ అధికారి గంగప్ప, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ జెపికె రాము హాజరయ్యారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజాసేవే లక్ష్యంగా పనిచేస్తున్న పాంచజన్య శ్రీనివాసులు అభినందనీయుడన్నారు. నాణ్యమైన విద్యను విద్యార్థులకు అందించడంతోపాటు ఎంతో మంది నిరుపేదలకు తానున్నానంటూ తన వంతు సహాయ సహకారాలను అందిస్తున్నారన్నారు. సాయి సదన్ లో ఉన్న విద్యార్థులకు ఉచిత విద్యను అందించడంతో పాటు వారికి అవసరమైన పుస్తకాలు సైతం అందించి నిరుపేద విద్యార్థులకు విద్యాదానాన్ని చేస్తున్నారన్నారు. శ్రీనివాసులు మాట్లాడుతూ దాతృత్వాన్ని మించిన సంపద లేదని, తనకున్నదాంట్లో కొంత భాగమైన ప్రజలకు సేవ చేయాలన్న సంకల్పంతో ముందుకు వెళ్తున్నానని చెప్పారు. ఇలాంటి మంచి కార్యక్రమాల్లో తన కుటుంబ సభ్యులతో పాటు, తన కుటుంబ సభ్యులుగా భావించే పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులను సైతం భాగస్వామ్యం చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ ఉపాధ్యక్షులు సందీప్, పాంచజన్య భారతి, పాఠశాల అకాడమిక్ డైరెక్టర్లు స్మిత, నందిత, కరస్పాండెంట్ నందకుమార్, ప్రైవేట్ స్కూల్ అసోసియేషన్ నాయకులు వేణుగోపాల్, రియాజ్, పాఠశాల ఏవో భాస్కర్, హెచ్ఎం గాయిత్రి, పాఠశాల సూపరింటెండెంట్ విజయేంద్ర, ఏహెచ్ఎంలు శశికళ సతీష్ కుమార్ షేక్ అబ్దుల్ రజాక్ తదితరులు పాల్గొన్నారు..

కుటుంబ సభ్యులతో కలిసి వృద్ధులకు చీరలు పంపిణీ చేస్తున్న శ్రీనివాసులు

# గిరిజనులు ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

**ప్రజాశక్తి- పుట్టపర్తి అర్బన్**

స్వాతంత్ర్యం సిద్ధించి 75 ఏళ్ల దాటుతున్నా ఇంకా కొన్ని మారుమూల గిరిజన గ్రామాలు సరైన మౌలిక సదుపాయాలకు నోచుకోలేదు. ప్రధానంగా రహదారులు, తాగునీరు, విద్యుత్, రవాణా సౌకర్యం తదితర మౌలిక సదుపాయాలు లేక ఇబ్బందులు పడుతున్న గిరిజన తండాలు, ఎరుకుల, యానాది తదితర వెనుకబడిన గిరిజన ఆవాసాలు ఎన్నో ఉన్నాయి. గిరిజన ఆవాసాల గ్రామాల అభివృద్ధికి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఏటా కోట్లాది రూపాయల నిధులు ఖర్చు చేస్తున్నాయి. మారుతున్న కాలానికి అనుగుణంగా సాంకేతికంగా కూడా అభివృద్ధి చెందాల్సిన అవసరం ఉంది. ఆ దిశగా గిరిజనులు వారి పిల్లలు పథకాలను అందిపుచ్చుకొని అభివృద్ధి చెందాల్సి ఉంది. ఈ నేపథ్యంలో జిల్లాలో గిరిజన సంక్షేమ శాఖ ద్వారా అందిస్తున్న పథకాలు గురించి జిల్లా గిరిజన సంక్షేమ అధికారి కె. మోహన్ రామ్ ప్రజాశక్తికి ఇచ్చిన ముఖాముఖి ఇంటర్వ్యూలో పలు అంశాలను వివరించారు. గిరిజనుల కోసం కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నాయని వాటిని సద్వినియోగం చేసుకొని అభివద్ధి చెందాలని ఆయన పేర్కొన్నారు.

**ప్రశ్న : జిల్లాలో ఎన్ని గిరిజన ఆవాస గ్రామాలున్నాయి.? అందులో అత్యంత వెనుకబడినవి ఎన్ని?**

**జవాబు:** జిల్లా వ్యాప్తంగా 450 గిరిజన ఆవాస గ్రామాలు ఉన్నాయి. ఇందులో ఏడు గ్రామాల్లో మౌలిక సదుపాయాలు లేనట్లుగా గుర్తించాం. రహదారులు, నీటి సదుపాయాలు, కల్పించడానికి తగు చర్యలు తీసుకుంటున్నాము. ఈ ఏడు ఆవాస గ్రామాలు ముదిగుబ్బ మండలం బత్తలపల్లితో పాటు మడకశిర, కదిరి నియోజకవర్గాలలో ఉన్నాయి. వాటిలో మౌలిక సదుపాయాలు కల్పించడానికి ప్రభుత్వానికి నివేదిక పంపాం.

**ప్ర: గిరిజనులకు కల్పిస్తున్న రుణ సదుపాయాలేవి ?**

**జ:** గిరిజనుల అభివృద్ధి కోసం 60 యూనిట్లు గుర్తించాం. వాటిలో గొర్రెలు, పాడి పశువులు, ట్రాక్టర్లు, బొలెరో వాహనాలు, తదితర వాటినిఅందించడానికి చర్యలు తీసుకుంటున్నాం. గిరిజన పాఠశాలల అభివృద్ధికి తగిన ప్రతిపాదనలను ప్రభుత్వానికి నివేదించాం.

**ప్ర: గిరిజన విద్యార్థులు ఎంతమంది ఉన్నారు.? వారికి ప్రత్యేక పాఠశాలలు ఎన్ని ఉన్నాయి.?**

**జ:** జిల్లాలో దాదాపు 1900 మంది గిరిజన విద్యార్థులు ఉన్నారు. వారికోసం ప్రత్యేక పాఠశాలలు ఉన్నాయి. ఒక ఆశ్రమ పాఠశాల, ఆరు గురుకుల పాఠశాలలు, ఐదు వసతిగృహాలు ఉన్నాయి. వాటిలో మౌలిక సదుపాయాలు కల్పించడం జరుగుతోంది.విద్యార్థులకు స్కాలర్‌షిప్‌ల మంజూరుకు ప్రతిపాదనలు పంపాం.

**ప్ర : సమగ్ర గిరిజన గ్రామాల అభవృద్ధికి ప్రభుత్వపరంగా తీసుకుంటున్న చర్యలు ఏమిటి.?**

**జ :** సమగ్ర గిరిజన అభివృద్ధి కోసం కేంద్ర ప్రభుత్వం జిల్లాలో 3 గ్రామాలను ఎంపిక చేసింది. మారుమూల గ్రామాలైన వాటిలో పూర్తిగా మౌలిక సదుపాయాలు కల్పించడమే లక్ష్యం. సోమందేపల్లి మండలం నాగినాయుని చెరువు తండా, తనకల్లు మండలంలో ముండ్ల వారి పల్లి, గాండ్లపెంట మండలంలో తుమ్మల బైలు గ్రామాలు ఎంపికయ్యాయి. వీటిని అన్ని రకాలుగా అభివృద్ధి చేసి ఆదర్శ గ్రామాలుగా తీర్చిదిద్దడమే ధ్యేయం. అందుకు కేంద్ర ప్రభుత్వం తగిన నిధులు మంజూరు చేయనుంది. వాటిలో గృహ నిర్మాణం, తాగునీటి సౌకర్యం, రహదారులు, విద్య, వైద్య సౌకర్యాలు ఇలా 17 రకాల అభివృద్ధి పనులు, మౌలిక సౌకర్యాలు కల్పిస్తాం. వీటిపై ఆయా శాఖల ద్వారా పర్యవేక్షణ ఉంటుంది. పూర్తిగా కేంద్ర ప్రభుత్వ నిధులతో ఆదర్శ గ్రామాలుగా తీర్చించడం జరుగుతుంది.

**ప్ర: మీశాఖలో సిబ్బంది కొరత ఉందా.? గిరిజనులకు మీరు ఇచ్చే సలహాలు ఏమిటి.?**

**జ:** సిబ్బంది కొరత ఏమీ లేదు. అభివృద్ధి పనులు ఆయా శాఖల పర్యవేక్షణలో జరుగుతాయి. తమ శాఖ ఆయా గిరిజన గ్రామాల్లో ఉన్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళుతుంది. గతంతో పోల్చుకుంటే గిరిజన గ్రామాలు అభివృద్ధి చెందుతున్నాయి. మారుతున్న సమాజానికి అనుగుణంగా అవసరాలు పెరుగుతుంటాయి. గిరిజనులు తమ పిల్లలను బాగా చదివించుకోవాలి. ప్రభుత్వం అందిస్తున్న పథకాలను అందుకొని వాటిని సద్వినియోగం చేసుకొని మరింత అభివృద్ధి చెందాలి.

## జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారి కె. మోహన్ రామ్

మోహన్‌రామ్

ప్రజాశక్తి
www.prajasakti.com



# అపరిష్కృతంగానే మహిళా సమస్యలు

## పాలకులు మారుతున్నా.. సమస్యలు తీరడం లేదు.. బాధిత మహిళలకు పరిహారం ఇవ్వలేని దుస్థితి..

## విశాల ఐక్య ఉద్యమానికి కార్యచరణ : ఐద్వా రాష్ట్ర కార్యదర్శి రమాదేవి

**ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి**

రాష్ట్రంలో ప్రభుత్వాలు, పాలకులు మారినా మహిళా సమస్యలు అపరిష్కృతంగానే ఉన్నాయని ఐద్వా రాష్ట్ర కార్యదర్శి రమాదేవి పేర్కొన్నారు. రాబోయే రోజుల్లో మహిళా సమస్యలపై మరింతగా ఐక్య ఉద్యమాలను ఐద్వా రూపొందిస్తుందని ఆమె తెలిపారు. అనంతపురం నగరంలో ఈ నెల 13 నుంచి 15వ తేదీ వరకూ మూడు రోజులపాటు జరుగుతున్న ఐద్వా 16వ రాష్ట్ర మహాసభల సందర్భంగా ఆమె ప్రజాశక్తితో మాట్లాడారు. గడిచిన మూడేళ్లలో చేపట్టిన పోరాటాలతో పాటు మహాసభలో చర్చించబోయే అంశాలను ఈ సందర్భంగా ఆమె తెలిపారు.

**ప్రశ్న : ఐద్వా 15 రాష్ట్ర మహాసభ నుంచి ఇప్పటి వరకు ఐద్వా రాష్ట్రంలో ఎటువంటి సమస్యలపై పోరాడింది. ?**

**రమాదేవి :** ఐద్వా మూడేళ్ల కాలంలో మహిళలపై జరిగిన హింసపై ఎప్పటికప్పుడు పోరాడింది. అదే విధంగా మైక్రోఫైనాన్స్ ఒత్తిడి వల్ల మహిళలు పడుతున్న ఇబ్బందులపై పనిచేసింది. మద్యం నియంత్రణ మీద, మహిళలకు ఉపాధిపైనా పనిచేసింది. అనకాపల్లి జిల్లాలోని కోట ఓరట్లలో ఎనిమిదవ తరగతి విద్యార్థినిపై దౌర్జన్యం జరిగితే దానికి వ్యతిరేకంగా బాధితురాలికి అండగా నిలిచిపోరాడింది. రాప్తాడులో కులాంతర వివాహం చేసుకున్నారని యువకుడిని చంపిన కేసులోనూ బాధితులకు న్యాయం చేయాలని మద్దతుగా నిలిచింది. మైక్రో ఫైనాన్స్ వేధింపులపై రాష్ట్రంలోసర్వే నిర్వహించి, దానిపై రాష్ట్రవ్యాప్త యాత్రను చేపట్టాం. ఆయా ప్రాంతాల్లో మహిళలపై ఎక్కడ హింస జరిగినా బాధితుల పక్షాన గొంతును ఐద్వా వినిపించింది.

**ప్రశ్న : మహిళలు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలేమిటి ?**

**రమాదేవి :** సమాజంలోనున్న అసమానతలు ఇప్పటికీ కొనసాగుతూనే ఉన్నాయి. హింస రోజురోజుకు పెరుగుతూనే ఉంది. నియంత్రణకు ప్రభుత్వాలు తీసుకుంటున్న చర్యలు నామమాత్రంగానే ఉంటున్నాయి. ఇటీవలి కాలంలో మైక్రో ఫైనాన్స్ వల్ల ప్రధాన బాధితులుగా మహిళలే ఉంటున్నారు. తాడేపల్లిలో ఒక మహిళ రూ.50 వేల అప్పు తీసుకుని పది లక్షలు చెల్లించినా అప్పు తీరలేదని అప్పుల వారి వేధింపులతో ఆత్మహత్య చేసుకుంది. 156 శాతం వరకు వడ్డీని వసూలు చేస్తున్నారు. ఇంత జరుగుతున్నా ప్రభుత్వం ఏమీ పట్టనట్టుగా వ్యవహరిస్తోంది. ప్రభుత్వం నిర్వహిస్తున్న పొదుపు సంఘాల్లోనే మహిళలను పీక్కుతింటున్నారు. బ్యాంకులు తొమ్మిది శాతం మాత్రమే వడ్డీ వసూలు చేయాల్సిన చోట రెండు రూపాయలకు ఎక్కడా తక్కువ ఉండటం లేదు. అంతేకాకుండా వారందరినీ కట్టుబానిసలుగా మార్చేసుకుని పని చేయించుకునే పరిస్థితులు రాష్ట్రంలో ఉన్నాయి. ప్రతి ప్రభుత్వ కార్యక్రమానికి వారు హాజరవ్వాల్సిందే అన్నట్టుగా ఉంది. మద్యం వలన ఇబ్బందులు పడుతున్నది మహిళలే. ప్రభుత్వం నాణ్యమైన మద్యం అని చెబుతోంది. ఏ మద్యమైనా ప్రజల ప్రాణాలను దెబ్బతీసేదే అవుతుంది.

**ప్రశ్న : మహిళా సమస్యల విషయంలో ప్రభుత్వ వైఖరి ఏ విధంగా ఉంది ?**

**రమాదేవి :** మహిళా సమస్యల విషయంలో పాలకులు ఎవరైనా వారి వైఖరి ఒకే విధంగానే ఉందని చెప్పాలి. 2023లో జరిగిన ఐద్వా 15వ మహాసభ నుంచి ఇప్పటి వరకు చూస్తే అటు వైఎస్.జగన్మోహన్‌రెడ్డి ఒకటిన్నర సంవత్సరం పాలన.. ఇటు కూటమి పాలనలోని విధానాల్లో ఎటువంటి మార్పూ లేదు. మద్యం అమ్మకాలను ఆ ప్రభుత్వం రూ.25 వేల కోట్లకు తీసుకెళితే.. ఈ ప్రభుత్వం రూ.35 వేల కోట్లకు తీసుకెళ్లాలని లక్ష్యంగా పెట్టుకుంది. ఊరూరా బెల్ట్‌షాపులు వచ్చేశాయి. హింసకు గురైన బాధితులకు అందించే పరిహారం కూడా అందివ్వలేని పరిస్థితుల్లో ఈ ప్రభుత్వాలు ఉన్నాయి. గత ప్రభుత్వ హయాంలో దీనిపై ఐద్వా పోరాడితే రూ.70 కోట్లు విడుదల చేసింది. ఇంకా పరిహారం అందాల్సిన వారు చాలా మందే ఉన్నారు. 70 శాతం మంది మహిళలు వర్కింగ్ ఉమెన్‌గా ఉన్నారు. ఏదోక చోట పనిచేస్తున్నారు. వారికి సరైన రక్షణగాని, కనీస వేతనాలు కూడా అందే పరిస్థితి లేకుండా ఉంది. దాని అమలు చేయించాల్సిన ప్రభుత్వాలు పట్టించుకోకుండా ఉంటున్నాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాకముందు మహిళలకు అనేక హామీలిచ్చింది. ప్రతి మహిళకు నెలకు రూ.1500 ఇస్తామని చెప్పింది. అదే విధంగా పది లక్షల రూపాయల వరకు వడ్డీలేని రుణాలిస్తామంది. వీటి గురించి ఇప్పుడు ఏమీ మాట్లాడటం లేదు.

**ప్రశ్న : 16వ మహాసభలో చర్చించబోయే అంశాలేమిటి.?**

**రమాదేవి :** అనంతపురం నగరంలో ఈనెల 13 నుంచి 15వ తేదీ వరకు మూడు రోజులపాటు ఐద్వా 16వ మహాసభ జరుగనుంది. 15వ మహాసభలో తీసుకున్న నిర్ణయాల అమలు ఏ మేరకు చేయగలిగామన్నది ఇందులో సమీక్షించి, రాబోయే మూడేళ్ల కాలంలో చేపట్టాల్సిన భవిష్యత్ కార్యచరణను రూపొందిస్తాం. మహాసభకు రాష్ట్రంలోని అన్ని జిల్లాల నుంచి ఎంపిక చేసిన 400 మంది ప్రతినిధులు హాజరవుతారు.

# మైనర్లను ఆపే వారేరీ.. !

**ప్రజాశక్తి-రొద్దం**

మండలంలోని పలు గ్రామాల్లో మైనర్లు యథేచ్ఛగా ద్విచక్ర వాహనాలు నడుపుతున్నా అడిగే వారు కరువయ్యారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ప్రధానంగా రొద్దం, ఆర్.మరవపల్లి, ప్రధాన రహదారిపై నిత్యం 10-15 ఏళ్ల వయసు గల పిల్లలు ద్విచక్ర వాహనాలు నడుపుతూ కనిపిస్తున్నారు. దీనికి తోడు వారు వాటర్‌క్యాన్‌ల ద్వారా నీరు తీసుకెళ్లడం, సెల్‌ఫోన్ మాట్లాడుతూ బైక్ నడపడం, ఒకే బైక్‌పై ముగ్గురు ప్రయాణించడం జరుగుతోంది. పిల్లలకు సరిగా కాళ్లు అందకపోవడం, జాగ్రత్తలు, రోడ్డు నిబంధనలు తెలియకపోవడం వల్ల ప్రమాదాలు జరిగే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి. ఏదైనా అనుకోని సంఘటన జరిగితే తల్లిదండ్రులకు కూడా కడుపుకోత తప్పదు. కావున తల్లిదండ్రులు పిల్లలకు బైక్‌లు ఇవ్వకూడదని విద్యావంతులు, బాధ్యత గల పౌరులు సూచిస్తున్నారు. అలాగే పోలీసులు కూడా మైనర్లు ద్విచక్ర వాహనాలు నడపకుండా చర్యలు తీసుకోవడంతో పాటు గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలను మరింత విస్తృతంగా చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

బైక్‌పై ముగ్గురు ప్రయాణిస్తూ

మోటార్ సైకిల్ నడుపుతున్న బాలుడు

ముగ్గురిని ఎక్కించి నడుపుతున్న బాలుడు

# పేదల డాక్టర్ రవీంద్రనాథ్‌రెడ్డి కన్నుమూత

**ప్రజాశక్తి-కదిరి అర్బన్**

ప్రఖ్యాత వైద్యులు, కదిరి శిల్ప నర్సింగ్ హోం అధినేత, రెడ్డి సంఘం సభ్యులు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు రవీంద్ర నాథ్‌రెడ్డి ఆదివారం కన్నుమూశారు. ఆయన పేదల డాక్టర్‌గా ఈ ప్రాంత ప్రజలకు సుపరిచితులు. పేరు పెట్టి ఆప్యాయంగా పలకరిస్తూ మానసిక, ఆరోగ్య జబ్బులను సునాయా సంగా తగ్గించే మన డాక్టర్ ఇక లేరన్న వార్తను ఆయన అభిమానులు జీర్ణించుకోలేక పోతున్నారు. పట్టణంలోని దత్త ఫంక్షన్ హాల్‌కు ఎదురుగా రెడ్డి భవనానికి 52 సెంట్ల స్థలం కేటాయించడంతో పాటు కదిరి రెడ్డి సంఘం అభివృద్ధిలో ఆయన కీలక పాత్ర పోషించారు. రాజకీయాల్లోనూ రాణించిన అనుభవం ఆయన సొంతం. రెడ్డి సంఘం దినదినాభివృద్ధి చెందుతూ సేవలు విస్తరించడానికి గట్టి పునాది వేసిన వారిలో ప్రముఖులు కావడంతో కదిరి రెడ్డి సంఘం సభ్యులు, బంధు మిత్రులు, అభిమా నులను ఆయన మరణం తీవ్ర దిగ్భ్రాంతికి గురి చేసింది. భౌతిక కాయాన్ని ప్రజల సందర్శనార్థం ఆయన నివాసం(శిల్ప నర్సింగ్ హోం)లో ఉంచారు. సోమవారం ఉదయం కదిరి గుండ్లపల్లి సమీపంలో ఉన్న రవీంద్రానాథ్‌రెడ్డి ఫామ్ హౌస్‌లో అంత్యక్రియలు నిర్వహించనున్నారు. ఆయన మృతి పట్ల పలువురు ప్రగాఢ సంతాపం తెలిపారు.

డాక్టర్ రవీంద్రనాథ్‌రెడ్డి(ఫైల్)

# విధులకు హాజరైన అటవీ శాఖ ఉద్యోగులు

చెక్‌పోస్ట్‌లో విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులు

**ప్రజాశక్తి కథనానికి స్పందన**

**ముదిగుబ్బ :** బుక్కపట్నం అటవీ రేంజ్ పరిధిలో దొరిగల్లు గ్రామం సమీపంలో ఏర్పాటు చేసిన చెక్ పోస్ట్‌లో సిబ్బంది సరిగా విధుల్లో ఉండ రన్న అంశం పై ఆదివారం ప్రజాశక్తిలో 'అటవీ శాఖ చెక్‌పోస్ట్‌లో కానరాని ఉద్యోగులు' శీర్షికన కథనం ప్రచురితమైం ది. దీనిపై అటవీ శాఖ అధికారులు స్పందించారు. వెంటనే ఆ చెక్‌పోస్టులో విధులు నిర్వహించేందుకు వెళ్లాలని ఉద్యోగులను ఆదేశించారు.

# పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

**ప్రజాశక్తి-బత్తలపల్లి**

'అందరి కళ్లలో చెప్పలేని ఆనందం.. చిన్ననాటి మిత్రులను కలుసుకున్న వారి ఆనందానికి అవధుల్లేవు.. అందరూ కుటుంబ సమస్యలు, ఇతరత్రా ఇబ్బందులు, తారతమ్యాలు అన్నీ మరిచిపోయారు. ఆప్యాయంగా పలుకరించుకున్నారు. ఆత్మీయంగా ఒకరి గురించి ఒకరు తెలుసుకుంటూ చిన్ననాటి మధుర స్మృతులు గుర్తుకు చేసుకున్నారు'. మండల కేంద్రమైన బత్తలపల్లిలోని ఎలిమెంటరీ పాఠశాలలో 2008-09 విద్యా సంవత్సరంలో 5వ తరగతి చదివిన విద్యార్థినీ, విద్యార్థులు ఆదివారం అదే ఎలిమెంటరీ పాఠశాలలో ఆత్మీయ సమావేశమయ్యారు. సుమారు 16 ఏళ్ల తర్వాత అందరూ ఒక చోట కలవడంతో సంభ్రమాశ్చర్యాలు, భావోద్వేగానికి లోనయ్యారు. చిన్ననాటి కబుర్లతో ఆనందోత్సాహాల మధ్య రోజంతా గడిపారు. ఇకపై ఏటా స్నేహితులందరం కలుసుకోవాలని నిర్ణయించుకున్నారు. ఒకరి కష్టాల్లో మరొకరు పాలుపంచుకునే విధంగా ప్రత్యేక ప్రణాళిక రూపొందించుకున్నారు. ఇలా అందరూ కలుసుకోవడం సంతోషంగా ఉందన్నారు. అప్పటి వారి గురువులను పూలమాలలు, శాలువాలతో ఘనంగా సన్మానించి జ్ఞాపికలు అందజేశారు. ఉపాధ్యాయులు మాట్లాడుతూ ఎంత ఎత్తుకు ఎదిగినా మీరు మా శిష్యులేనని, మీరు మరింత ఉన్నత స్థానాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. మా వద్ద చదువుకున్న మీరు ప్రస్తుతం వివిధ రంగాల్లో రాణిస్తుండడం మాకు గర్వంగా ఉందన్నారు. ఇలా అందరినీ కలవడం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో అప్పటి ఉపాధ్యాయులు, విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు.

బత్తలపల్లిలో సమావేశమైన పూర్వ విద్యార్థులు

బాధితురాలి అత్తింటి వారితో చర్చిస్తున్న ప్రజాసంఘాల నాయకులు

# భర్త ఇంటి ముందు గర్భిణి నిరసన

## బాధితురాలికి ప్రజా సంఘాల మద్దతు

**ప్రజాశక్తి-సోమందేపల్లి**

ఆశ్రయం కోసం నిండు గర్భిణి భర్త ఇంటి ముందు నిరసన చేపట్టిన సంఘటన మండలంలోని పందిపర్తి గ్రామంలో చోటుచేసుకుంది. వివరాలు.. పందిపర్తి గ్రామంలోని అంబేద్కర్ కాలనీలో ఆదివారం 9 నెలల గర్భిణి మౌనిక ఆశ్రయం కోసం భర్త హరీష్ ఇంటి ముందు బైఠాయించి నిరసన చేపట్టింది. ఈ విషయం సోషల్ మీడియాలో విస్తృతంగా వైరల్ కావడంతో స్పందించిన ఐద్వా, భవన నిర్మాణ కార్మిక సంఘం, వ్యవసాయ కార్మిక సంఘం, ప్రజాసంఘాల నాయకులు హనుమక్క, అలివేలమ్మ, కొండా వెంకటేశులు, రవి, పెద్దన్న హుటాహుటిన ఆ గ్రామం వెళ్లారు. మౌనిక, ఆమె తల్లిదండ్రులు, అత్త, మామలతో విచారించారు. మౌనిక పట్ల వేధింపులకు పాల్పడడంతో పాటు భర్తతో పాటు అత్త, మామలు, తోడికోడళ్లు ఇంట్లోకి రానివ్వకుండా అడ్డుపడడాన్ని తీవ్రంగా ఖండిం చారు. మౌనిక మాట్లాడుతూ హరీష్ తనను ప్రేమ వివాహం చేసుకున్నాడన్నారు. ఆ తర్వాత నుంచి వేధింపులకు గురి చేస్తూ వచ్చారన్నారు. తాను గర్భం దాల్చగా అనుమానంతో వేధిస్తున్నారని నాయకులతో మొరపెట్టుకుని కన్నీటి పర్యంతమైంది. న్యాయం చేయాలని పోలీస్‌స్టేషన్‌కు వెళ్లగా స్పందించిన పోలీస్ అధికారులు మౌనికను ఇంటికి తీసుకెళ్లాలని, లేనిచో చట్టబద్ధంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించినా భర్త, అత్తమామలు ఇంట్లోకి రానివ్వడం లేదని మౌనిక వాపోయింది. మౌనికకు రక్షణ కల్పించి న్యాయం జరిగే వరకూ పోలీసు, రెవెన్యూ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసి చట్టబద్ధంగా పోరాడుతామని, ధైర్యంగా ఉండాలని మౌనిక, ఆమె తల్లిదండ్రులకు ప్రజా సంఘాల నాయకులు భరోసా ఇచ్చారు.

# సత్యసాయి శత జయంతి ఉత్సవాలకు భద్రత మరింత కట్టుదిట్టం

## డ్రోన్‌లు, సీసీ కెమెరాలతో 24/7 పటిష్ట నిఘా : ఎస్పీ

**ప్రజాశక్తి-పుట్టపర్తి రూరల్**

శ్రీసత్యసాయి బాబా శత జయంతి ఉత్సవాలు పురస్కరించుకొని పుట్టపర్తిలో భద్రతను మరింత కట్టుదిట్టం చేశామని ఎస్పీ ఎస్.సతీష్‌కుమార్ తెలిపారు. శ్రీసత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ సహకారంతో రూ. 1.39 కోట్ల వ్యయంతో పట్టణంతో పాటు చుట్టుపక్కల 10 కి.మీ మేర వివిధ ప్రాంతాల్లో మొత్తం 216 కెమెరాలు ఏర్పాటు చేయనున్నారు. సీసీ కెమెరాల ఏర్పాటు పనులను ఆదివారం స్థానిక గణేష్ కూడలిలో ముఖ్యఅతిథులుగా హాజరైన ఎస్పీతో పాటు ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ ఆర్‌జె.రత్నాకర్, ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి, మాజీ మంత్రి పల్లె రఘునాథ్‌రెడ్డి పూజలు చేసి ప్రారంభించారు. ఎస్పీ మాట్లాడు తూ బాబా జయంతి ఉత్సవాలకు దేశ, విదేశాల నుంచి వివిఐపిలు, వివిపిలతో పాటు భక్తులు సుమారు 10 లక్షల మంది హాజరయ్యే అవకాశం ఉండడంతో పటిష్ట భద్రతా ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. సీసీ కెమెరాలు నవంబర్ 2వ తేదీ నుంచి అందుబాటులోకి వస్తాయన్నారు. పట్టణంతో పాటు పరిసర ప్రాంతాల్లో ఆటోమేటిక్ నంబర్ ప్లేట్ రికగ్నైజేషన్(ఎఎన్‌పిఆర్) కెమెరాలు 10, స్టాటిక్ కెమెరాలు 169, ఇతర కెమెరాలు 47 కలిపి మొత్తం 216 కెమెరాలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. పుట్టపర్తికి వచ్చే ప్రతి మార్గం, చుట్టుపక్కల 10 కిలోమీటర్ల లోపు ఈ కెమెరాలను అమరుస్తామన్నారు. వీటిని కంట్రోల్ రూమ్‌కు లింక్ చేస్తామన్నారు. డ్రోన్‌లు సైతం వినియోగిస్తామని, అందులో 2 నైట్ విజన్ డ్రోన్లను ఉపయోగిస్తామన్నారు. ఇలాంటి ఏర్పాటు రాష్ట్రంలో ఎక్కడా ఉండదని, ప్రప్రథమంగా పుట్టపర్తిలోనే ఏర్పాటు చేస్తున్నామన్నారు. పోలీసు కంట్రోల్ రూమ్‌ను ఆధునిక సాంకేతిక సౌకర్యాలతో సిద్ధం చేస్తున్నామన్నారు. నవంబర్ 25వ తేదీ వరకూ సీసీ కెమెరాలు, డ్రోన్లు 24/7 పని చేసేలా నిరంతరం సిబ్బంది పర్యవేక్షిస్తారన్నారు. ముమ్ముందు కూడా ఇవి పని చేస్తాయన్నారు. భద్రతపరంగా చిన్న తప్పి దం కూడా జరగకుండా పకడ్బందీ చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఎమ్మెల్యే సింధూరారెడ్డి మాట్లా డుతూ సత్యసాయి శత జయంతి ఉత్సవాల నేపథ్యంలో భద్రత దృష్ట్యా సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడం సంతోషంగా ఉందన్నారు. పుట్టపర్తి ప్రశాంతత, భద్రతను కాపాడేందుకు ఈ కెమెరాలు చాలా ఉపయోగపడతాయన్నారు. కార్యక్రమంలో ఆర్డీవో సువర్ణ, డీఎస్పీ విజయ్‌కుమార్, ట్రస్ట్ సభ్యులు, సివిలు శివాంజనేయులు, గోపీనాథ్‌రెడ్డి, ఎస్ఐ లింగన్న, కూటమి పార్టీల నాయకులు పాల్గొన్నారు.

సీసీ కెమెరాల ఏర్పాటు పనులను ప్రారంభిస్తున్న ఎస్పీ, ఎమ్మెల్యే, ట్రస్టీ రత్నాకర్

# వైద్య కళాశాలల 'పిపిపి'పై బహిరంగ చర్చకు సిద్ధమా

## వైసిపికి ఎమ్మెల్యే కందికుంట సవాల్

**ప్రజాశక్తి-కదిరి టౌన్**

గతంలో వైసిపి ప్రభుత్వం చేపట్టిన విధానంతో వైద్య విద్యార్థుల భవిష్యత్ ప్రశ్నార్థకమైందని ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ విమర్శించారు. కూటమి ప్రభుత్వం పిపిపి విధానంలో వైద్య కళాశాలలను ప్రైవేట్‌కు అప్పగించడంపై వైసిపి చేస్తున్న విమర్శలను తిప్పికొట్టారు. నకిలీ మద్యం బయటపడగానే సిఎం చంద్రబాబు చర్యలకు ఉపక్రమించారని అందులో భాగంగా ఇన్‌చార్జిపై సస్పెన్షన్ వేటు వేశారని స్పష్టం చేశారు. పట్టణంలోని తన నివాసంలో ఆదివారం ఎమ్మెల్యే విలేకరుల సమావేశంలో మాట్లాడారు. వైసిపి హయాంలో జగన్ ప్రభుత్వం రుషికొండ ప్యాలెస్‌కు నిధులు మంజూరు చేసిందే కానీ వైద్య కళాశాలలకు డబ్బులు చెల్లించ లేదన్నారు. అధికారంలో ఉన్నా ప్రతిపక్షంలో ఉన్నా నిరంతరం అబద్ధాలు చెప్పి ప్రజలకు మభ్య పెట్టడమే జగన్ వైఖరి అన్నారు. ప్రజలు ఆయన ఉచ్చులో పడకుండా ఉండేందుకు వాస్తవాలను తెలుపుతున్నామన్నారు. జగన్ విధానం వల్ల వైద్య విద్యార్థులు ఒక సంవత్సరం చదువుకు దూరం కాకూ డదనే ఉద్దేశంతో వారి భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని సిఎం చంద్రబాబు పిపిపి విధానానికి శ్రీకారం చుట్టారన్నారు. ఈ విధానంలో వైద్య కళాశాలలో 110 సీట్లు రాబోతున్నట్లు తెలిపారు. పిపిపి విధానంపై వైసిపి బహిరంగ చర్చకు సిద్ధమా అని ప్రశ్నించారు. జగన్ ఆయన సతీమణి భారతి మద్యం దుకాణాల ద్వారా డబ్బులు దండుకున్నారని ఆరోపించారు. మద్యంపై మాట్లాడే నైతిక విలువలు వైసిపికి ఉన్నాయా అని ప్రశ్నించారు. కియా పరిశ్రమలో కొరియన్ దేశస్తుడిని భయపెట్టిన ఘనత, అధికారం అడ్డుపెట్టుకొని కియాలో సైతం వసూళ్లకు పాల్పడిన చరిత్ర వైసిపి పాలకులది అన్నారు. మాజీ ఎమ్మెల్యే ప్రకాష్‌రెడ్డి పేదల ఇంటి నిర్మాణాలకు సంబంధించి 164 మంది ఎమ్మెల్యేలు డబ్బులు వసూలు చేస్తున్నారనీ అసత్య ఆరోపణలు చేస్తున్నారని, ఇకనైనా చౌకబారు, అసత్య ఆరోపణలు మానుకోవాలని హితవు పలికారు. దమ్ముంటే చర్చకు కదిరికి రావాలని ప్రకాష్‌రెడ్డికి సవాల్ విసిరారు. సమావేశంలో కౌన్సిలర్ ఆల్ఫా ముస్తఫా, టిడిపి నాయకుడు గంగులప్ప, తదితరులు ఉన్నారు.

విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్

# తాగునీటి పైప్‌లైన్‌కు మరమ్మతులు

## ప్రజాశక్తి కథనానికి స్పందన

**ముదిగుబ్బ :** మండలంలోని చిన్నకోట్ల గ్రామం నుంచి కదిరి మున్సిపాలిటీ తాగునీరందించే పైప్‌లైన్‌కు మండలంలోని దొరిగల్లు గ్రామం లీకేజీ ఏర్పడి నీరు వృథా అయ్యేది. దీనిపై ఇటీవల ప్రజాశక్తిలో 'తాగునీరు వృథా అవుతున్నా స్పందించరా..?' శీర్షికన కథనం ప్రచురితమైంది. దీంతో స్పందించిన కదిరి మున్సిపాలిటీ అధికారులు రెండు రోజులుగా నీటి సరఫరాను ఆపేసి మరమ్మతులు చేపట్టి తాగునీటి వృథాను అరికట్టారు.

# నేడు కలెక్టరేట్‌లో గ్రీవెన్స్

**పుట్టపర్తి అర్బన్ :** పట్టణంలోని కలెక్టర్ కార్యాలయంలో ప్రతి సోమవారం నిర్వహించే 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక'(గ్రీవెన్స్) యథావిధిగా కొనసాగుతుందని కలెక్టరేట్ అధికారులు ఓ ప్రకటనలో తెలిపారు.

# మార్కెట్ యార్డ్ ఛైర్మన్‌ను కలిసిన పోతుల సురేష్

**కొత్తచెరువు :** కొత్తచెరువు మార్కెట్ యార్డ్ నూతన ఛైర్మన్‌గా ఇటీవల బాధ్యతలు చేపట్టిన పూల శివప్రసాద్‌ను ఆదివారం పోతుల సురేష్ మర్యాద పూర్వకంగా కలిశారు. కొత్తచెరువులోని పూల శివప్రసాద్ ఇంట్లో ఆయనను కలిసి పూలమాల వేసి శాలువాతో సన్మానించి అభినందనలు తెలిపారు. మార్కెట్ యార్డులో నెలకొన్న సమస్యలను పరిష్కరించి, యార్డ్ అభివృద్ధికి తమ వంతు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు ఎన్.శ్రీనివాసులు, పూల వెంకటేష్, కూటమి పార్టీల నాయకులు పాల్గొన్నారు.

# 'భారతీయ ముస్లిం లెజెండ్స్'కు జాతీయ పురస్కారం

**హిందూపురం :** పట్టణానికి చెందిన కల్లూరు ఉమర్ ఫారూఖ్ ఖాన్ తెలుగులో రచించిన భారతీయ ముస్లిం లెజెండ్స్ పుస్తకానికి బజ్మె ఏ షాహీన్ జాతీయ పురస్కారం దక్కింది. బెంగళూరు ప్యాలెస్ గ్రౌండ్ లో జరిగిన జాతీయ ఉర్దూ కవి సమ్మేళనంలో బజ్మె ఏ షాహీన్ 50 వ జాతీయ భావైక్యత ఉర్దూ కవి సమ్మేళనంలో జాతీయ కవులు షేక్ ముబారక్ దమామ్. కర్నాటక మైనార్టీ నాయకులు అబ్దుల్ హన్నాన్ జె. షఫీఉల్లా మైనార్టీ నాయకులు అల్లాబకాష్ ఆమెరీ జూలూసీ మొహమ్మదీ మౌలానా సయీద్ బాక్సిలు ఉమర్ ఫారూఖ్‌కు అవార్డును అందజేశారు. గోల్డెన్ నేషనల్ యూనిటీ పొయెట్రీ ఫెస్టివల్‌కు బజ్మే ఏ షాహీన్ అధ్యక్షులు అల్హాజీ బాబాజీ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో పక్తలు మాట్లాడుతూ, దేశాన్ని పట్టి పీడిస్తున్న మతోన్మాదం, వర్గ వైషమ్యాలు, జాత్యాహంకారం నిర్మూలన, శాంతి సామరస్యాల సాధన తదితర అంశాలపై పలు సూచనలు చేశారు. కల్లూరు ఉమర్ ఫారూఖ్ ఖాన్ మాట్లాడుతూ తెలుగు భాషా చైతన్యంతో పాటు దేశ వ్యాప్తంగా మత సామరస్యం, పరమత సహనం, సోదర భావం పెంపొందించి వసుధైక కుటుంబ నిర్మాణం కోసం ఆచరణాత్మక అడుగులేస్తూ తెలుగు భాషా సాహిత్య సందేశం జాతీయ స్థాయిలో కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో దేశ వ్యాప్త ఉర్దూ, హిందీ, కన్నడ, తెలుగు కవులు, రచయితలు కొతారీ అల్కా, జైన్ శరార్, మంజర్ భూపాలీ, హమీద్, భూసావలీ, యూసుఫ్, యల్ గార్ రియాజ్ సాగర్, ముజఫర్ నగర్, మెహతాబ్ ఆలం, వసీం జాహ, గీరాబాదీ, దిల్ ఖైరా బాదీ, ఖుర్షీద్ హైదర్, కాశిఫ్ రజా తదితరులు పాల్గొన్నారు

# ఎమ్మెల్యేకు ముస్లిముల ఆహ్వానం

**కదిరి టౌన్ :** రూరల్ మండల పరిధిలోని కుమ్మరవాండ్లపల్లిలో నూతనంగా మసీదు నిర్మించనున్నారు. మజీద్ ఉస్మాన్ ఏ ఘని భూమి పూజ శంకుస్థాపన కార్యక్రమంలో పాల్గొనాలని కోరుతూ ఆదివారం కుమ్మర వాండ్లపల్లి మసీదు కమిటీ సభ్యులు పట్టణంలోని ఎమ్మెల్యే నివాసంలో కందికుంట వెంకట ప్రసాద్‌ని కలిసి ఆహ్వానించారు. కార్యక్రమంలో మజీద్ ఏ ఉస్మాన్ ఏ ఘని కమిటీ సభ్యులు వార్డు కౌన్సిలర్ ఆల్ఫా ముస్తఫా, టిడిపి నాయకులు గంగులప్ప, యూనస్, సుధాకర్, ఈశ్వర్, తదితరులు ఉన్నారు.

# ప్రభుత్వాసుపత్రి తనిఖీ

**ప్రజాశక్తి-ధర్మవరం రూరల్**

ఆర్డీవో మహేష్ ఆదివారం పట్టణంలోని ప్రాంతీయ ప్రభుత్వ ఆసుపత్రిని పరిశీలించారు. ఆయన ఆసుపత్రిలో రోగులకు అందుతున్న వైద్య సేవలు, పరిశుభ్రత, ఔషధాల లభ్యత, సిబ్బంది హాజరు, తదితర అంశాలపై సమీక్షించారు. వార్డులను పరిశీలించి కాసేపు రోగులతో ముచ్చటించారు. వైద్యం, సదుపాయాల గురించి వివరాలు తెలుసుకున్నారు. రోగుల పట్ల పూర్తి శ్రద్ధ, దయ, బాధ్యతతో వ్యవహరించాలని ఆసుపత్రి సిబ్బందిని ఆదేశించారు. ఆసుపత్రి పరిసరాలను ఎల్లప్పుడూ పరిశుభ్రంగా ఉంచాలని, రోగులకు సంబంధం లేని బయటి వ్యక్తులు ఆసుపత్రిలో సంచరిం చకుండా చూడాలని సిబ్బందికి సూచించారు. రోగులకు వైద్య సేవల్లో ఎలాం టి నిర్లక్ష్యం వహించకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించడమే వైద్యుల ప్రధాన లక్ష్యమని తెలిపారు.

# విద్యార్థులపై బాధ్యతగా వ్యవహరించాలి

**బత్తలపల్లి :** పాఠశాలల్లోని విద్యార్థినీ, విద్యార్థుల పట్ల బాధ్యతగా వ్యవహరించాలని ఆర్డీఓ మహేష్ ఉపాధ్యాయులకు సూచించారు. మండలంలోని సంజీవపురం సమీపంలో ఉన్న కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయను ఆదివారం ఆయన సందర్శించారు. కాసేపు విద్యార్థినులతో ఆత్మీయంగా ముచ్చటించారు. వారికి అందజేస్తున్న సదుపాయాలు, వసతి, భోజనం, బోధనా ప్రమాణాల గురించి ఆరా తీశారు. అనంతరం ఉపాధ్యాయ బృందంతో మాట్లాడారు. విద్యార్థునుల సంక్షేమం పట్ల ఎలాంటి నిర్లక్ష్యం వహించవద్దని సూచించారు. సిబ్బంది పిల్లల పట్ల పూర్తి శ్రద్ధ, ప్రేమ, బాధ్యతతో వ్యవహరించాలని సూచించారు. విద్యార్థునులకు అవసరమైన అన్ని సదుపాయాలు సమయానికి అందించేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.